క్లుప్తంగా

మాజీ మంత్రి 'పెద్దిరెడ్డి'ని కలసిన జిల్లా నేతలు



మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని కలసిన విశ్వరూప్, జగ్గిరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: తన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డిని చూసేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్దకు వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జిల్లా వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పీఏసీ సభ్యుడు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌లు మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని కలసి మాట్లాడారు. వారితో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కర్రి నాగిరెడ్డి తదితరులు మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు దాతలు మంగళవారం విరాళాలు అందించారు. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన రంకిరెడ్డి శ్రీను, సత్యవతి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు. తిరుపతికి చెందిన కాగిత వెంకట రమణారావు, స్నేహలత దంపతులు రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. వారిని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ అభినందించారు.

జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలి



కొత్తపేటలో ఏఓ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కొత్తపేట: అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా, కొత్తపేట నియోజకవర్గ శాఖల కార్యవర్గాల సభ్యులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొత్తపేట ఆర్డీవో కార్యాలయం వద్ద జర్నలిస్టుల డిమాండ్లను నినదిస్తూ నిరసన తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, సీనియర్, రిటైర్మెంట్ జర్నలిస్టులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరవలి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డేగల బాబి, నామాడి శివాజీ, కుంపట్ల త్రిమూర్తులు, జగతా రాంబాబుతదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరిస్తున్న రిటైర్డ్ టీచర్ ఆనందరావు

పి.గన్నవరం: నరేంద్రపురంలోని గురుకుల పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కత్తుల ఆనందరావు మంగళవారం రూ.31 వేల విలువైన ఇన్వర్టర్ బహూకరించారు. అధ్యాపక సిబ్బంది దాత ఆనందరావును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, ఎస్ఎంసీ చైర్మన్ సికిలే ప్రభాకరరావు, నాయకులు నేలపూడి సత్యనారాయణ, జేవీ రమణ, కిరణ్మయి, కె.వెంకటేశ్వరరావు, సీహెచ్ రవిశంకర్, టీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాజోలు: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాజోలులోని పెన్షనర్ల సంఘ భవనంలో రాజోలు తాలూకా యూనిట్ ఏపీజీఈఏ కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సంఘ కోశాధికారి బీజే రాజ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. పీఆర్‌సీ ప్రకటించే వరకు ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలతో పాటు అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ కార్యదర్శి కె.మల్లిబాబు విజ్ఞప్తి చేశారు.

మందకొడిగా నాట్లు

- జోరందుకోని ఖరీఫ్
- రాజోలు దీవిలో 40 శాతం మించని వైనం
- నత్తనడకన సాగు పనులు



బట్టేలంకలో తయారైన నారుమడి



శంకరగుప్తంలో వరి నాట్లు వేస్తున్న కార్మికులు

మలికిపురం: ప్రస్తుత సార్వా సీజన్‌లో వ్యవసాయ పనులతో గ్రామాలు కళకళలాడాల్సింది పోయి వెలవెలబోతున్నాయి. ఆగస్టు నాటికి నాట్లు పూర్తి కావాల్సి ఉండగా ఇపుడిపుడే నాట్లు ప్రారంభం అవుతున్నాయి. ఈ సీజన్‌లో మొత్తం 50 శాతం కూడా నాట్లు పడే అవకాశం లేదని స్పష్టం అవుతుంది. రాజోలు దీవిలో పలు గ్రామాల్లో గత పదిహేనేళ్లుగా రైతులు సార్వాకు పంట విరామం ప్రకటిస్తున్నారు. రాజోలు దీవిలో ఉప్పునీటి, ముంపు బెడదతో పాటు సాగులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సఖినేటిపల్లి మండలంలో కేశవదాసుపాలెం, అంతర్వేదికర, దేవస్థానం, అంతర్వేదిపాలెం, వుయ్యూరి వారిమెరక, శృంగవరప్పాడు, గొంది, రామేశ్వరంలో సార్వాకు స్వస్తి చెప్పారు. మలికిపురం, విశ్వేశ్వరాయపురం, గుడిమెళ్లంక, బట్టేలంక, శంకరగుప్తం, గూడపల్లి, మట్టపర్రు, కత్తిమండ, చింతలమోరి గ్రామాల్లో 10 శాతం నాట్లు పడే అవకాశం ఉంది. రామరాజులంక, దిండిలలో నారుమడులు కూడా వేయలేదు. రాజోలు మండలంలో పలు గ్రామాల్లో 65 శాతం నాట్లు పడే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో నాట్లు 25 శాతం పూర్తయ్యాయి. ఇక మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో ఇప్పటికే నారుమడులు తయారు కాగా చాలా ఆయకట్టులో వరి చేలను దమ్ము చేయించడంతో పాటు, గట్టులంక వేయడం, మెరకలు సరి చేయడం వంటి పనులు సాగిస్తున్నారు. సార్వా సాగుకు సాగునీటి కొరత అనేది ఉండదు. భారీ వర్షాల వల్ల తెగుళ్ల బెడద కూడా అంతగా ఉండదు. ఈ కారణంగా సార్వాలోనే గతంలో నాట్లు అధికంగా పడేవి. అయితే రానురానూ ముంపు భయంతో సార్వా సాగు మందగించింది. ప్రస్తుతం ముంపు తీవ్రత, డ్రైన్స్ పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సార్వా సాగుపై రైతులు విరక్తి చూపడం వల్ల ప్రస్తుతం సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో సఖినేటిపల్లి మండలంలో సుమారు 7500 ఎకరాలు, మలికిపురం మండలంలో సుమారు 3 వేల ఎకరాలు, రాజోలు మండలంలో సుమారు 7600 ఎకరాల్లో వరిసాగు ఆయకట్టు ఉంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో సఖినేటిపల్లి మండలంలో 330 ఎకరాలు, మలికిపురం మండలంలో 790 ఎకరాలు, రాజోలు మండలంలో 3548 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం ఖరీఫ్ నాట్లు పడే అవకాశం ఉంది. మిగిలిన ఆయకట్టు ముంపు ప్రాంతాలుగా మిగిలిపోయాయి. జూలై నెల ప్రారంభంలోనే నారుమడులు ప్రారంభించిన రైతులు నారు తయారు కావడంతో నాట్లకు సమాయత్తం అయ్యారు. మొత్తానికి ప్రస్తుతం రాజోలు నియోజక వర్గంలో 30 శాతం నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు అంటున్నారు. మిగిలిన ఆయకట్టులో చురుకుగా పనులు సాగుతున్నాయి. సాగునకు సరిపడా ఎరువులు, పురుగు మందులను సిద్ధం చేశారు.

ఎరువులు సిద్ధంగా ఉన్నాయి



ప్రస్తుతం గ్రామాల్లో రైతులు చురుకుగా సార్వా సాగు పనులు చేస్తున్నారు. ముంపు బెడద కారణంగా ఇక్కడ సార్వా సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు సిద్ధంగా ఉంచాం. రైతులు వరి చేలకు అవసరం మేరకు ఎరువులు, పురుగుమందులు వాడాలి.

– సీహెచ్ రమ్య ప్రియాంక, ఏఓ, మలికిపురం

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



జి.అగ్రహారంలో బాబు మోసాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు



ములికిపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం

అంబాజీపేట: ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్‌తో పాటు అనేక హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా జనాన్ని పదేపదే మోసాలు చేసి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో పరిశీలకులు ముత్తాబత్తుల ప్రశాంత్, కాండ్రేగుల గోపాలకృష్ణ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రతి రైతుకూ వ్యవసాయ పెట్టుబడి సాయంగా కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా, రాష్ట్ర ఖజానా నుంచి రూ.20 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చారన్నారు. నేడు దానిని రూ.14 వేలకు ఎందుకు తగ్గించి రైతులన మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ రైతులకు చేసిన మేలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యవకులు ప్రతి వర్గాన్ని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందన్నారు. బాబు వస్తే జాబు అన్నారు.. బాబు వచ్చాక జాబులే పీకేస్తున్నారని విమర్శించారు మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు మందపాటి కిరన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టి, హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబూస్ క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు వివరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, రాయుడు మీరయ్య, ఎం.ఎం.శెట్టి. కోట బేబిరాణి, పితాని కాశీ, నక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో మోసాలు గ్యారంటీ: మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో సంక్షేమం మాట ఎలా ఉన్నా మోసాలు గ్యారంటీగా ఉంటాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం పొన్నమండ, చింతలపల్లి, కూనవరం, ములికిపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించారు. గొల్లపల్లి మాట్లాడుతూ అనేక అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కూటమి మోసాలను, అన్యాయాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడంపై దృష్టి సారిస్తున్నారన్నారు. పొన్నమండ, ములికిపల్లి, కూనవరం, చింతలపల్లి గ్రామశాఖల అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్, దొమ్మేటి శ్రీనివాస్, కలిగితి వెంకటేశ్వరరావు, నల్లి నాగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, నాయకులు తెన్నేటి కిషోర్, కొల్లాబత్తుల సతీష్, మద్దుల కాసు, గుబ్బల మనోహర్, కంచర్ల శేఖర్, మోకా సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఐ ధర్నా



సఖినేటిపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు



రాజోలు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సఖినేటిపల్లి: వినియోగదారుల ఇళ్ల వద్ద విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం సఖినేటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ శ్రేణులు ధర్నా చేశారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికే ట్రూ అప్ సర్‌చార్జీల పేరుతో వారిని దోపిడీ చేస్తున్నారని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. రూ.9 వేలు విలువైన స్మార్ట్ మీటర్‌ను 93 నెలల్లో వినియోగదారుడే చెల్లించాలని, ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలకే కాక అందరికీ నష్టం చేకూరుతుందని వారు పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి గెద్దం ప్రభాకర్‌రావు, నాయకులు చెల్లుబోయిన తాతారావు, దొండపాటి భానోజీ, బళ్ళ పెద్ద, నల్లి జయరాజు, గేదెల తిరుపతి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ధర్నా

రాజోలు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజోలు సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ట్రూ అప్ చార్జీలు, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు దేవ సురేష్‌బాబు, పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

శిశువులకు విధిగా తల్లిపాలు తాగించాలి

మామిడికుదురు: శిశువులకు విధిగా తల్లి పాలు తాగించాలని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎన్‌జీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సభలో సర్పంచ్ తాతకాపు మాట్లాడారు. పోత పాలు వద్దు, తల్లి పాలు తాగించండి, తల్లి పాలలో రోగ నిరోధక శక్తి మెండుగా ఉందని చెప్పారు. ముర్రుపాలు తాగించడం నామోషీగా భావించవద్దని ఆయన చెప్పారు. దీనిపై ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ వార్డు సభ్యుడు బోనం అబ్బులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించి శిశువులకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మూడేళ్ల లోపు చిన్నారుల వరకూ ముర్రుపాలను అందిద్దామని చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లక్ష్మీస్నేహలత అన్నారు. చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ గ్రామాల్లో కొత్తపేట సీడీపీఓ అధికారి గజలక్ష్మి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. చిన్నారులకు తల్లిపాలు సక్రమంగా అందకపోవడం వల్ల పౌష్టికాహార లేమి ఉత్పన్నమై తీవ్ర అనారోగ్యం పాలవుతున్న విషయాన్ని వివరించారు. సర్పంచ్‌లు దంగేటి చంద్రకళ, లంక వరప్రసాదరావు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎం గాయత్రి పాల్గొన్నారు.

మనమిత్ర వినియోగంపై అవగాహన

అయినవిల్లి: ప్రజల చేతిలో ప్రభుత్వం సేవలు ఉండేలా ఏర్పాటు చేసిన మనమిత్ర వాట్సాప్ యాప్ వినియోగంపై డిప్యూటీ ఎంపీడీఓ వాణిశ్రీ బెహర మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షతన ప్రారంభించారు. వాణిశ్రీ బెహరా, జయసావిత్రి ఇంటింటికీ వెళ్లి మనమిత్ర యాప్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు మనమిత్ర యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి వంటివి ఇంటింటికీ వెళ్లి నేర్పించారు. యాప్ ద్వారా అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



మనమిత్ర యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వాణిశ్రీ బెహరా, సర్పంచ్ జయసావిత్రి

ఆలమూరు: పెదపళ్ల సర్పంచ్ యేడిద సత్యశ్రీ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ఏర్పాటు చేసిన ర్యాలీలో ఎంపీడీఓ ఎ.రాజు, చింతలూరు నీటి సంఘం చైర్మన్ గారపాటి శ్రీనివాసరావు పాల్గొని వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగాన్ని వివరించారు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానం ద్వారా ప్రజలకు సుమారు 200 సేవలు అందుతాయని తెలియజేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, మాజీ ఎంపీటీసీ యేడిద మెహెర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోకో సాగుతో అధిక ఆదాయం

కొత్తపేట: కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం సాధించాలని కొవ్వూరు రీజినల్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ (ఆర్‌హెచ్‌ఆర్ఎస్) అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ డి.వెంకటస్వామి రైతులకు సూచించారు. అంబాజీపేట ఆర్‌హెచ్‌ఆర్ఎస్, డెరెక్టర్ ఆఫ్ జీడిమామిడి అండ్ కోకో డెవలప్‌మెంట్ బోర్డు కొచ్చి, కేరళ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అవిడిలో బుద్ధరాజు భాస్కర రామరాజు కోకో వ్యవసాయ క్షేత్రంలో కోనసీమ వ్యాప్తంగా వివిధ మండలాల కోకో రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. వివిద శాస్త్రవేత్తలతో కొత్తపేట హెచ్‌ఓ డాక్టర్ జి.కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సదస్సుకు సర్పంచ్ రెడ్డి చంటి అధ్యక్షత వహించగా ఏడీఆర్ డాక్టర్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కోకో సాగు విలువ ఆధారిత ఉత్పత్తులు, పంట సాగు యాజమాన్య పద్ధతులు, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉన్న కోకో ప్రాసెసింగ్, మార్కెటింగ్ పద్ధతుల గురించి వివరించారు. కోకో కొనుగోలు చేస్తున్న కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర కంటే 25 శాతం తక్కువకు కొనుగోలు చేస్తున్నాయని రైతులు, అధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను ఉద్యాన శాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కొత్త కంపెనీలను తీసుకురావడం ద్వారా నిర్దిష్టమైన ధరకు కొనుగోలు చేయించి న్యాయం చేయాలని కోరారు. అలాగే పంటకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏడీఆర్ వెంకటస్వామిని రైతులు ఘనంగా సత్కరించారు. ఈ సదస్సులో అంబాజీపేట హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.అశోక్, శాస్త్రవేత్తలు కిరీటి, ఎం.తిరుపతిరెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, వి.అనూష, బి.నీరజ, సంఘమిత్ర, హెచ్‌ఓలు, డ్వామా పీఎం త్రినాథ్, ఉపాధి ఏపీఓ ఎస్.ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

పొలం గట్టు ఏర్పాటుతో అదనపు ఆదాయం

రాజోలు: పొలానికి ఎల్ ఆకృతిలో గట్టు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సలహాదారు ఆదినారాయణ అన్నారు. కడలిలో మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పోతురాజు ప్రసన్నకుమార్ పొలంలో రాజోలు సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవాకేంద్ర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏగ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్, శాశ్వత ద్రవ జీవామృతం ట్యాంక్ ఉపయోగాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పొలం చుట్టూ మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తు, వెడల్పుతో గట్టును ఏర్పాటు చేసుకుని దానిపై అరటి, కాయగూరలు, ఆకుకూరలు సాగు చేసుకోవచ్చన్నారు. ఎంటీలు బాబురావు, జోసఫ్‌రాజ్, డీఎం ఎంటీ నాగబాబు, సురేష్, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుని పోస్టు భర్తీకి దరఖాస్తు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్ గా అతిథి అధ్యాపకుడిగా పనిచేయుటకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్‌వీ సూర్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్ 50% పైన మార్కులు ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీగా నిర్ణయించామన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కంప్యూటర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్స్ సబ్జెక్టు అతిథి అధ్యాపకుడిగా బోధించుటకు ఈ సబ్జెక్టు పీజీ డిగ్రీలో 55 శాతం మార్కులు కలిగిన ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కళాశాల ఆఫీస్‌లో సమర్పించాలన్నారు. వివరాలకు 9440015140, 9866698628 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు భూమి పూజ

ఆలమూరు: మండలంలోని సూర్యారావుపేటలో ఆర్వో ప్లాంట్‌కు మంగళవారం భూమి పూజ జరిగింది. ఎన్‌జీఓ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన రూ.పది లక్షలతో నిర్మించనున్న ఈ ఆర్వో ప్లాంట్‌కు సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, ఎన్‌జీఓ మేనేజర్ స్వర్ణలత శంకుస్థాపన చేశారు. ఈఆర్వో ప్లాంట్‌ను త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని మేనేజర్ స్వర్ణలత కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలపపై ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ తగ్గించాలి

రావులపాలెం: స్థానిక టింబర్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల టింబర్ బాంబు అండ్ సామిల్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. పోతంశెట్టి కనికిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యాపారులు పలు అంశాలపై, సమస్యలపై చర్చించారు. ప్రధానంగా ప్రస్తుత టెక్నాలజీ పరంగా గుమ్మాలకు ప్లాస్టిక్‌తో కూడిన డబ్ల్యూపీసీ వంటి మెటీరియల్ వాడడంతో కలప వినియోగం తగ్గిందన్నారు. ఈ పరిస్థితుల్లో కలప వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడం ద్వారా అమ్మకాలు పెంచుకునే విధంగా వ్యాపారులు కృషి చేయాలన్నారు. అలాగే కలపపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని ప్రభుత్వం తగ్గించాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం.గణేష్, తెల్ల సుబ్బారావు, రామారావు చౌదరి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ మృతి

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ చిట్టూరి నాగేశ్వరరావు అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

'పెద్దిరెడ్డి'ని కలసిన కో-ఆర్డినేటర్



ఎమ్మెల్యే రామచంద్రారెడ్డిని కలసిన శ్రీనివాసరావు

మామిడికుదురు: అక్రమంగా అరెస్టు చేసిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలిసేందుకు రాజమంహేంద్రవరం వచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట అంబాజీపేట మండల పార్టీ అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్, పార్టీ నేతలు మేక రామకృష్ణ చౌదరి ఉన్నారు.

15లోగా ఈ-పంట నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రతి రైతు ఈ-పంట నమోదును ఈ నెల 15వ తేదీలోగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్ అన్నారు. చిరతపూడిలో సర్పంచ్ కోట బేబీరాణి అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్యం పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అన్నదాత సుఖీభవలో ఎవరైనా గ్రీవెన్స్‌లు ఉంటే ఆయా గ్రామాల వ్యవసాయ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివమోహన్, వీఏఏ బి.లలిత, ఏహెచ్ఏ కె.చినబాబు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ప్రముఖ యోగా గురువు కోట బ్రహ్మానందం సూచించారు. హేమానంద్ యోగా శిక్షణ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనం ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు. మొక్కలను విచక్షణా రహితంగా కొట్టేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకున్న విధంగానే ప్రతి ఒక్కరూ పచ్చని చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. యోగా గురువు హేమలత, యోగా సాధకులు బత్తుల రమేష్, నైనాల రామకృష్ణ, నైనాల సత్యదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని మోరి, ఉయ్యూరువారి మెరక గ్రామాల్లో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా బాధితులు ఇరువురికి కలిపి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. సంస్థ అధ్యక్షుడు వేమన శివాజీ సహకారంతో మోరిలో బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అడబాల నరేంద్రకు, ఉయ్యూరువారి మెరకలో వినికిడి, కంటి చూపు సమస్యలతో ఉన్న మేడిది మెస్సయ్యలకు పై సాయం అందజేశారు. సంస్థ ప్రతినిధులు గెద్దం విజయ్ మోహన్, రాపాక ఆదామ్ ప్రసాద్, రాపాక చిన్ని, నల్లి ప్రసాదరావు, నల్లి మోహన్, కంకిపాటి ఏసురాజు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ మృతికి సంతాపం

సఖినేటిపల్లి: మొక్కతోట ఏరియాకు చెందిన రిటైర్డ్ టీచర్ జిల్లెళ్ల వెంకటపతిరాజు మృతికి వైఎస్సార్ సీపీ రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సంతాపం మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మృతదేహం వద్ద గొల్లపల్లి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

స్కూల్ వాహనాలను తనిఖీ చేసుకోవాలి

రాజోలు: స్కూల్ వాహనాల తీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని రాజోలు సీఐ నరేష్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజోలు ఎమ్మార్పీ భవనం వద్ద ఆల్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు స్కూల్స్ డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ అతి వేగంగా స్కూల్ బస్సులు నడపవద్దని, పరిమితికి మించి విద్యార్థులను బస్సులో అనుమతించవద్దన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే దానికి డ్రైవర్లే బాధ్యత వహించవలసి ఉంటుదన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం తాగి వాహనం నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఎంఈఓ నల్లి మనోహరం, ఆల్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ప్రైవేటు స్కూల్ సంఘ కార్యదర్శి తాటికాయల అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా రాంబాబు



ఆలమూరు: స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా జనసేన మండల ప్రధాన కార్యదర్శి బైరిశెట్టి రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా దేవదాయశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఈఓ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. సభ్యులుగా అయినవిల్లి వీర వెంకట సత్యనారాయణమూర్తి, కట్టా శ్రీనివాస్, ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మమ్మ, సబ్బవరపు రామాయమ్మ, బొబ్బా రాంబాబు, కొప్పాడి జయబాబు, దారా దుర్గాభవాని ఎంపికై న వారిలో ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌కు చైర్మన్‌గా ఎంపికైన రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ఫిల్టర్ అందజేత

అయినవిల్లి: మండలంలోని చింతనలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు దేశంశెట్టి ప్రసాద్ పేరున మంగళవారం వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ వాటర్ ఫిల్టర్ రూ.35 వేలు ఉంటుందని ప్రసాద్ కుటుంబసభ్యులు తెలిపారు. ప్రసాద్ పేరున ఆయన కుమారులు వెంకటగిరి, రామకృష్ణలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లయ్యశాస్త్రికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.